క్లుప్తంగా

బోల్తా పడిన లారీ



గొయ్యిలోకి బోల్తా పడిన లారీ

అల్లవరం: వెట్ మిక్స్ కంకరతో ఓడలరేవు ఓఎన్‌జీసీ ప్లాంట్‌కు వచ్చిన లారీ అదుపు తప్పి గొయ్యిలోకి బోల్తా పడింది. ఓఎన్‌జీసీ ప్లాంట్‌లోకి వెళ్లేందుకు అవసరమైన గేటు పాస్ తీసుకునేందుకు సెక్యూరిటీ పాయింట్ వద్ద గేటు ముందు డ్రైవర్ లారీని నిలిపి వెళ్లాడు. అయితే అక్కడ వాలు ఉండడంతో లారీ వెనక్కు వెళ్లిపోయి పక్కనే ఉన్న గొయ్యిలో పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

ఇంజరం ఉపసర్పంచ్‌కు సత్కారం



ఉపసర్పంచ్ అప్పారావును సత్కరిస్తున్న సర్పంచ్ శివరామప్రసాద్ తదితరులు

తాళ్లరేవు: మండల పరిధిలోని ఇంజరం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన వైఎస్సార్ సీపీ నాయకుడు కోరుకొండ అప్పారావును మంగళవారం ఘనంగా సత్కరించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం.వెంకట శివరామప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు కోరుకొండ కిరణ్‌కుమారి, పెయ్యల కొండబాబు, కోరుకొండ చంటి తదితరులు ఘనంగా సత్కరించి అభినందించారు. తనపై నమ్మకం ఉంచి పదవిని కట్టబెట్టిన ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్కు ఉపసర్పంచ్ అప్పారావు కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నారి ఆపరేషన్‌కు ఆర్థిక సాయం



శివాత్మిక తల్లికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: కాకినాడకు చెందిన 9 ఏళ్ల చిన్నారి కంచుమర్తి శివాత్మిక నడుము వెన్నెముక యొక్క పార్శ్వం కుడివైపు కుంభాకారంతో వంగి ఉండటంతో గత కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతుంది. బాలికకు ఆపరేషన్ చేయాలని తెలియడంతో స్థానిక బీజేపీ అధ్యక్షుడు కనకాల రాజు, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, యానాం పరిసర ప్రాంతాల కార్యకర్తలు సేకరించిన రూ.1,30,370 నగదును బాధితురాలి తల్లికి మంగళవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అందజేశారు. సకాలంలో స్పందించి ఆపరేషన్‌కు సహకరించినందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

తాళ్లరేవు: రోజూ క్రమం తప్పకుండా ధ్యానం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కాకినాడ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం జార్జిపేటలోని మాతాజీ ఆశ్రమంలో ధ్యానంపై అవగాహన తరగతులు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో యోగా గురువు కె.రాధాకృష్ణ, కమలమ్మ, అన్యం రామకృష్ణారావు, రాచకొండ చంటి తదితరులు పాల్గొన్నారు.

సైనికుల సేవలు చిరస్మరణీయం



ఎన్.కొత్తపల్లిలో వెంకటేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న సర్పంచ్ చిట్టికుమారి

ఉప్పలగుప్తం: తమ ప్రాణాలకు తెగించి దేశ ప్రజలను కంటికి రెప్పలా కాపాడే సైనికుల సేవలు చిరస్మరణీయమని సర్పంచ్ కుంచే చిట్టికుమారి అన్నారు. గ్రామానికి చెందిన కొంకి వెంకటేశ్వరావు 38 ఏళ్ల పాటు బీఎస్ఎఫ్ ఆఫీసర్‌గా పనిచేసిన ఇటీవలే పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు దంపతులను ఎన్.కొత్తపల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చిట్టికుమారి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నడింపల్లి వాసురాజు, బొడ్డు నాగేశ్వరావు, కుంచే చిన్ని, లంకే సూరిబాబు, కొంకి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుండెపూడిలో భవిష్యత్‌కు గ్యారెంటీ

అల్లవరం: మండలంలోని గుండెపూడిలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వేగిరాజు వెంకటరాజు ఆధ్వర్యంలో మంగళవారం బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నాయకుడు పోతుల సుభాష్‌చంద్రబోస్, పోతుల నరసింహరావు, పోతుల అప్పారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాడు అధ్వానం.. నేడు అమోఘం

- తాళ్లరేవు మండలంలో గ్రామీణ రహదారులకు మహర్దశ
- రూ.3.50 కోట్ల వ్యయంతో రహదారుల నిర్మాణం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు



నాడు: గోతులతో అధ్వానంగా ఉన్న సుంకటరేవు–నీలపల్లి ఆర్‌అండ్‌బీ రహదారి



నేడు: సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసిన సుంకటరేవు–నీలపల్లి రహదారి



నాడు: పోలేకుర్రు వద్ద భారీ గోతులతో ప్రమాదకరంగా ఉన్న తాళ్లరేవు–బాబానగర్ రహదారి



నేడు: నూతనంగా నిర్మించిన తాళ్లరేవు–బాబానగర్ రహదారి

తాళ్లరేవు: ఒకప్పుడు ఆ రహదారుల్లో ప్రయాణం ప్రహసనంగా ఉండేది. మండల కేంద్రం నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే అనేక రహదారులు గోతులు, గొప్పులతో అత్యంత ప్రమాదకరంగా ఉండేవి. నిత్యం ఏదోచోట ప్రమాదం జరిగి వాహన చోదకులు, పాదచారులు గాయాల పాలయ్యేవారు. వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. ఏళ్ల తరబడి రహదారులు అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యలను గుర్తించి రహదారులను సుందరీకరించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూ.3.50 కోట్లతో రహదారుల అభివృద్ధి

తాళ్లరేవు మండల పరిధిలోని నీలపల్లి–సుంకటరేవు, తాళ్లరేవు–బాబానగర్ తదితర రహదారులు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు, స్థానికులు అనేక ఇబ్బందులు పడేవారు. గ్రామీణ ప్రాంతాల రహదారులు కావడంతో ప్రతి పనికి సమీపంలోని మండల కేంద్రం, పట్టణానికి వెళ్లాల్సిన పరిస్థితి. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, ఆస్పత్రులకు వెళ్లే రోగులు పడరాని పాట్లు పడేవారు. గోతుల రహదారుల్లో నిత్యం ప్రయాణించడం వల్ల నొప్పులతో బాధపడాల్సి వస్తుందని, తమ వాహనాలు సైతం పాడైపోతున్నాయని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసేవారు. ప్రజా సమస్యలను గుర్తించిన ప్రభుత్వం ఆయా రహదారులను సుమారు రూ.3.50 కోట్ల వ్యయంతో సర్వాంగ సుందరంగా నిర్మించింది.

ఇదీ పరిస్థితి

- తాళ్లరేవు–బాబానగర్ ఆర్‌అండ్‌బీ రహదారికి రూ.96.50 లక్షలు, సుంకటరేవు–నీలపల్లి రహదారికి రూ.2.52 కోట్లు వెచ్చించి రహదారుల సమస్యను పరిష్కరించారు.
- రహదారుల్లో నీరు నిలిచిపోయి స్థానికులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పి.మల్లవరం పంచాయతీ పెదపేట, పత్తిగొంది గ్రామాల్లోని పలుచోట్ల సిమెంట్ రహదారులు సైతం వేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. ఆయా రహదారుల్లో పలు ప్రాంతాల్లో దీర్ఘకాలంగా ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించడం గమనార్హం.
- నీలపల్లి చెక్‌పోస్టు సెంటర్ నుంచి పత్తిగొందికి వెళ్లే దారిలో మురుగునీరు, వర్షం నీరు నిలిచిపోయి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గతంలో ఎంతమంది పాలకులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత స్థానికులు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో వెంటనే ఆ రహదారికి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయించారు. దీర్ఘకాల సమస్యకు మోక్షం కల్పించడంతో స్థానికుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం



గతంలో రహదారులు అధ్వానంగా ఉండడంతో అనేక ఇబ్బందులు పడేవాళ్లం. పి.మల్లవరానికి పోలేకుర్రు మీదుగా వెళ్లే రహదారి పెద్ద పెద్ద గోతులతో చాలా ప్రమాదకరంగా ఉండేది. రోజూ ఏదో ప్రమాదం జరిగేది. ముఖ్యంగా రాత్రి వేళ ప్రయాణం అంటే నరకప్రాయమే. రహదారిని అభివృద్ధి చేయడంతో ఇప్పుడు ప్రయాణం చాలా సుఖవంతమైంది. – ధూళిపూడి వెంకట్రావు, పి.మల్లవరం

చాలా ఆనందంగా ఉంది



సుంకటరేవు నుంచి పి.మల్లవరం, పత్తిగొంది, నీలపల్లి గ్రామాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లం. రహదారిలో గోతుల కారణంగా ప్రమాదాల బారిన పడేవాళ్లం. మురుగు నీరు, వర్షం నీరు రహదారిపై చేరి చెరువులను తలపించేవి. ప్రభుత్వం రహదారిని నిర్మించడంతో మా కష్టాలు తొలగిపోయాయి. చాలా ఆనందంగా ఉంది. – జక్కల చిన్నారి, సుంకటరేవు, పోలేకుర్రు పంచాయతీ

ఉపాధ్యాయులే నవ సమాజ నిర్మాతలు



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ శేషగిరిరావు



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామి



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు శ్రీదేవిని సత్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు

- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

అల్లవరం: సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులు కీలకపాత్ర వహిస్తారని వారు నవసమాజ నిర్మాతలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని తూర్పులంక ఉన్నత పాఠశాలలో హెచ్ఎం యు.మల్లపరాజు అధ్యక్షతన జరిగిన మంగళవారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు కిరణ్‌బాబు, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తంలో..

ఉప్పలగుప్తం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలో పనిచేస్తున్న ప్రధాన ఉపాధ్యాయులందరినీ జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు ఆయన స్వగృహంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే అవకాశం ఉపాధ్యాయునికి మాత్రమే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, ఎస్.సత్యకృష్ణ, చిక్కం మైనర్‌బాబు, సూదా రామారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

యానాం: స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో మంగళవారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 10 శాతం మెడికల్ సీట్లు ఇచ్చేందుకు నిర్ణయించడం సంతోషకరమని సీఎం రంగసామి, ఎల్జీ తమిళిసైకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం యానాంలో విశేష సేవలందిస్తున్న ఉపాధ్యాయులు పంపన నాగేంద్రరావు, పెద్దింటి విజయలక్ష్మి, క్షత్రియ మురళీకృష్ణ, గుత్తుల వెంకటేశ్వరరావు, బాలాంత్రపు శ్రీనివాస్, నందికోళ్ల స్వర్ణలతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ శాఖచే గురు పూజోత్సవం

అమలాపురం టౌన్: జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక వడ్డిగూడెంలోని బాలికల వసతి గృహంలో జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి అధ్యక్షతన గురు పూజోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ అధికారులను సత్కరించారు. గురు పూజోత్సవం సందర్భంగా స్థానిక వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలో గురు పూజోత్సవం జరిగింది.

తాళ్లరేవు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు ఎం.శ్రీదేవితో పాటు మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ తదితరులు దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

అమలాపురం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన గురుపూజోత్సం మంగళవారం ఘనంగా జరిగింది. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వి.జానకి సత్యభాను, మండల ఉత్తమ ఉపాధ్యాయులు కె.శ్రీనివాస్, పి.కృష్ణకుమారి, వీపీఎస్ నాగిని, జీఎస్ఎన్ మూర్తి, ముత్యాల రవికుమార్‌లను జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, ఎంఈవో గుబ్బల సూర్య ప్రకాశం తదితరులు సత్కరించారు.

ఐ.పోలవరం: స్థానిక మండల పరిషత్‌లో మండల విద్యాశాఖాధికారి ఎస్.కొండారెడ్డి అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమం మంగళవారం జరిగింది.

అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు



కొత్తగా మంజూరైన పింఛన్లు తీసుకున్న లబ్ధిదారులతో ఎంపీ అనురాధ

అల్లవరం: అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఏడాదిలో రెండు పర్యాయాలు కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్నామని ఎంపీ చింతా అనురాధ అన్నారు. మొగళ్ళమూరు పంచాయతీ పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఎంపీ కార్యాలయంలో మంగళవారం ఎంపీ అనురాధ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అనురాధ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏటా పింఛన్ రూ.250 పెంచుతున్నామని, జనవరి నుంచి రూ.3 వేలు పింఛన్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాకే కృష్ణమూర్తి, కొరుకొండ చిట్టిబాబు, కార్యదర్శి రాజమోహన్, వీఆర్‌ఓ చిట్టిబాబు పాల్గొన్నారు.


వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభం


అలమూరు: గ్రామంలో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయక ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విక్రమ భట్టీశ్వరస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రావాడ సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయంలో ఈనెల ఐదు నుంచి ఏడు వరకు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా బ్రహ్మశ్రీ కాళ్ళకూరి దుర్గాప్రసాద్ శర్మ పర్యవేక్షణలో వేద పండితులు కాళ్లకూరి సూరిపండు, వెలవలపల్లి చైతన్య కృష్ణ మంత్రోచ్ఛారణల మధ్య ప్రతిష్ఠాపన మహోత్సవ పూజలు, హోమాలు ప్రారంభించారు. ఈ పూజల్లో రావాడ సత్తిబాబు, రావాడ నరేష్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల ఏడున స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించేందుకు వేద పండితులు శుభ ముహూర్తంగా నిర్ణయించినట్లు నిర్వాహకులు తెలిపారు.

మెడికల్ సీట్ల రిజర్వేషన్ జీఓ విడుదల


యానాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివి నీట్ అర్హత సాధించిన విద్యార్థులకు మెడికల్ కోర్సుల్లో 10 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ ఆరోగ్య కార్యదర్శి కె.కెనడీ మంగళవారం జీఓ విడుదల చేశారు. ఈ మేరకు పుదుచ్చేరి ప్రభుత్వ నిర్ణయాన్ని కేంద్రం ఆమోదించింది. నిబంధనల ప్రకారం 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే అర్హులు. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఏఎంఎస్ కోర్సుల్లో ఈ విద్యా సంవత్సరం నుంచే కోటా అమలవుతుందన్నారు. 10 శాతం కోటా నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 37 ఎంబీబీఎస్ సీట్లతో పాటు 11 డెంటల్ సీట్లు, 4 ఆయుర్వేద సీట్లు రానున్నాయి. ఆ లెక్కన 37 ఎంబీబీఎస్ సీట్లలో పుదుచ్చేరికి 10, కారైకల్ 2, మాహే 13, యానాం–1 సీటు రానున్నాయి.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు










కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ప్రధానోపాధ్యాయుడు వీధి సురేష్‌బాబు, కుంచే బాలకృష్ణ, ఉప్పే సత్యనారాయణ, వీపూరి బాగిరాజు



పుదుచ్చేరి సీఎం రంగసామి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సాయిజానకి

ఐ.పోలవరం/అమలాపురం టౌన్/అమలాపురం రూరల్/కాట్రేనికోన/యానాం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం ముమ్మిడివరంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరావుల చేతుల మీదుగా పలువురు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు అందుకున్నారు. ఐ.పోలవరం జెడ్పీ పాఠశాల హెచ్ఎం వీధి సురేష్‌బాబు, అమలాపురం పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల బయోలజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు కుంచే బాలకృష్ణ, అమలాపురం రూరల్ మండలంలోని సాకుర్రు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ఉప్పే సత్యనారాయణ, కాట్రేనికోన మండలంలోని గెద్దనపల్లి పంచాయతీ చింతలమెరక ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీపూరి బాగిరాజు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. యానాం పట్టణానికి చెందిన అంబేడ్కర్ నగర్ డీఎస్ఆర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు బులుసు సాయిజానకి మంగళవారం పుదుచ్చేరిలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో సీఎం రంగసామి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డును అందుకున్నారు. వారిని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు కోసం వినతి



ఎంపీ అనురాధకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

అల్లవరం: ఈ నెల 18 నుంచి 22 వరకూ జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుని ప్రవేశపెట్టేలా చూడాలని కోరుతూ ఎంపీ అనురాధకు ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు మొగళ్ళమూరులోని ఎంపీ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. గోడిలోని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ని ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు కలిసి ఎస్సీ వర్గీకరణ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు వినతపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుమర్తి మోహన్, లంక రాంబాబు, లూటుకుర్తి చిన్న, యార్లగడ్డ రామకృష్ణ, కిషోర్, ఖండవల్లి ఏలియా, సత్తాల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన

అల్లవరం: 18 రకాల చేతి వృత్తిదారులకు ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా అందించే ప్రయోజనాలపై అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌లకు ఎంపీడీఓ కృష్ణమోహన్ మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చేతివృత్తిదారులకు రూ.15 వేలు విలువ చేసే పనిముట్లను రాయితీపై అందించడంతో పాటు వారికి శిక్షణనిస్తారని తెలిపారు. వ్యాపారాభివృద్ధి కోసం రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకూ రుణం ఇస్తారన్నారు. చేతివృత్తిదారులు తయారుచేసిన వస్తువులకు ప్రభుత్వం మార్కెటింగ్, బ్రాండింగ్ సదుపాయం కల్పిస్తుందని ఎంపీడీఓ తెలిపారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకానికి సంబంధించిన దరఖాస్తులు సచివాలయంలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

నా మట్టి - నా దేశం విజయవంతం చేయాలి

అమలాపురం రూరల్: నా మట్టి – నా దేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథ్‌రాజు అన్నారు. మండలంలోని రోళ్లపాలెంలో మంగళవారం నా మట్టి – నా దేశం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ, పొట్లూరి రామ్మోహనరావు, జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు అడబాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆర్బయిన్



ముమ్మిడివరంలో మాతం నిర్వహిస్తున్న ముస్లింలు

ముమ్మిడివరం: ముమ్మిడివరంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఆర్బయిన్ నిర్వహించారు. మంగళవారం స్థానిక బీబీ జైన బీయా పీర్ల పంజా వద్ద మహమ్మద్ ప్రవక్త మనవడు ఇమామ్ హుస్సేన్ కుటుంబసభ్యులకు బాధాతప్త హృదయాలతో ఘనంగా నివాళులర్పించారు. ముంబై నుంచి విచ్చేసిన మౌలానా అఖిల్ తులాభి భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ కర్బలాలో ఇమామ్ హుస్సేన్ త్యాగం ఇస్లాంను రక్షించిందన్నారు. అనంతరం ముమ్మిడివరం పుర వీధుల్లో మాతం నిర్వహించారు. పలు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు



చిన్న కృష్ణుడు, గోపికల వేషధారణల్లో చిన్నారులు

అమలాపురం టౌన్: కృష్ణాష్టమి సందర్భంగా స్థానిక భాష్యం స్కూలులో చిన్నారుల చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలు అలరించాయి. స్కూలుకు చెందిన దాదాపు 20 మంది చిన్నారులు వివిధ వేషధారణల్లో మంగళవారం సందడి చేశారు. తొలుత శ్రీకృష్ణుని ప్రతిమకు చిన్నారులు పూజలు చేసి వేడుకల్లో పాల్గొన్నారు. రాధాకృష్ణులపై గీతాలు ఆలపించి నృత్యాలు చేశారు.